సాక్షి నిజామాబాద్

శనివారం । 31 । మే । 2025



పేరుకే పార్ట్‌టైం..

ప్రభుత్వ పాఠశాలల్లో పరిశుభ్రతతోపాటు సౌకర్యాలు కల్పించే పార్ట్‌టైం స్వీపర్ల పరిస్థితి దయనీయంగా మారింది.

- 10లో ▸



అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

అర్హులందరికీ దశల వారీగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం అన్నారు.

- 10లో ▸

గరిష్టం/కనిష్టం

37.4 /24.4

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఉదయం ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

కేసు పెట్టారు.. వదిలేశారు!

- సీఎంఆర్ రికవరీలో అధికారుల తీరు
- ఒకరికి ధాన్యం ఇచ్చి.. మరొకరికి వేధింపులు
- నిజామాబాద్ జిల్లాలో రూ.250 కోట్లు, కామారెడ్డి జిల్లాలో రూ.45 కోట్ల విలువైన సీఎంఆర్ పెండింగ్
- చివరికి ఇన్‌చార్జి మంత్రి నిలదీయాల్సిన పరిస్థితి.. అయినా రికవరీపై అనుమానాలే..



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: సామాన్యుడు చిన్న తప్పిదం చేస్తే, అది నిరూపణ కాకముందే యుద్ధ ప్రాతిపదికన చర్యలకు ఉపక్రమించే అధికార యంత్రాంగం.. భారీ మాయాజాలం విషయంలో మాత్రం ప్రజాధనాన్ని రికవరీ చేయకుండా తమకేం సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తోంది. దీనిపై సాక్షాత్తూ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశంలో అధికార యంత్రాంగాన్ని కడిగిపారేశారు. 2014–15 నుంచి 2022–23 సంవత్సరాలకు సంబంధించి నిజామాబాద్ జిల్లాలో 44 మిల్లుల నుంచి రూ.250 కోట్లు, కామారెడ్డి జిల్లాలో 49 మిల్లుల నుంచి రూ.45 కోట్ల విలువజేసే సీఎంఆర్ రికవరీ చేయాల్సి ఉంది. ఇందులో బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ నుంచి రావాల్సిందే రూ.60 కోట్ల మేర ఉండడం గమనార్హం. ఇందుకు సంబంధించి ఈ నెల 29న కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో మంత్రి జూపల్లి ఉన్నతాధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లవుతున్నప్పటికీ రికవరీ చేయకుండా నోటీసులిచ్చి వదిలేయడమేమిటంటూ అసహనం వ్యక్తం చేశారు. షెడ్యూల్, యాక్షన్ ప్లాన్ రూపొందించుకుని కేసుల మీద కేసులు పెట్టి ఆరు నెలల్లో రికవరీ చేయాలని ఆదేశించారు.

■ సీఎంఆర్ విషయంలో బాధ్యులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు మంత్రికి వివరించారు. దీంతో సంతృప్తి చెందని మంత్రి జూపల్లి రెండువారాల్లో పూర్తి వివరాలతో యాక్షన్ ప్లాన్ తయారు చేసుకుని అడ్వొకేట్ జనరల్‌తో కలిసి హైదరాబాద్‌లో సమీక్షకు రావాలని ఆదేశించారు.

■ హైకోర్టు ఆదేశాలతో కేసు అయితే నమోదు చేశారు కానీ.. తదుపరి విచారణ, చర్యల విషయంలో ఒక్క అడుగు కూడా ముందుకు పడకపోవడం గమనార్హం. బాధితుడి సంతకం ఫోర్జరీ చేసినట్లు నిర్ధారణకు వచ్చిన హైకోర్టు తక్షణమే కేసు నమోదు చేయాలని ఆదేశించడంతో చేసినప్పటికీ, ఇప్పటివరకు ఒక్కసారి కూడా సదరు అధికారులను పోలీసులు ప్రశ్నించకపోవడం పట్ల విమర్శలు వస్తున్నాయి. కాలయాపన చేస్తే చాలు అన్నట్లుగా యంత్రాంగం వ్యవహరిస్తోందని కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు గుర్రుగా ఉన్నారు. వందలకోట్ల ప్రజాధనం అక్రమార్కులు బొక్కేస్తే ఉన్నతాధికారులు పట్టనట్లు వ్యవహరిస్తుండడంపై వాళ్లకు సైతం వాటాలు ముట్టినట్లు కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు.

■ 2021–22 యాసంగి, 2022–23 వానాకాలం సీజన్లకు గాను షకీల్‌కు చెందిన రహీల్, రాస్, అమీర్, దాన్విక్ అనే మిల్లుల పేరిట 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ప్రభుత్వం ఇచ్చింది. అయితే ఈ మిల్లుల్లో ఒక్క గింజ ధాన్యం కూడా మిల్లింగ్ చేయలేదు. నేరుగా ధాన్యాన్ని అక్రమ మార్గంలో ముంబై, కాకినాడ పోర్టుల ద్వారా ఎగుమతి చేసి సొమ్ము చేసుకున్నాడు. కేవలం 5 వేల మెట్రిక్ టన్నుల ధాన్యానికి ఇచ్చేంత పరిమాణంలో రీసైకిల్ బియ్యాన్ని పౌరసరఫరాల శాఖకు ఇచ్చాడు. ఓ 10 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రం ఏఆర్ ఇండస్ట్రీస్ (ఎడపల్లి), ఆర్‌కాం ఇండస్ట్రీస్ (వర్ని), అబ్దుల్ ఐ ఇండస్ట్రీస్ (ఎడపల్లి), ఎఫ్‌టీఎఫ్ ఇండస్ట్రీస్ (బోధన్) వాళ్లకు ఇచ్చినట్లు చూపించాడు. ఈ నాలుగు మిల్లుల యజమానులతో అధికారాన్ని అడ్డం పెట్టుకుని బలవంతంగా ధాన్యం తీసుకున్నట్లు లేఖలు ఇప్పించాడు. షకీల్ ఒత్తిడితోనే లేఖలు ఇచ్చినట్లు సదరు మిల్లర్లు తెలిపారు. రూ.60 కోట్ల విలువ చేసే ధాన్యానికి బియ్యం ఇవ్వకపోవడంతో ప్రభుత్వం షకీల్‌కు చెందిన మిల్లులకు రూ.10 కోట్ల జరిమానా వేసింది. ఇప్పటివరకు షకీల్ కస్టమ్ మిల్లింగ్ రైస్ ఇవ్వకపోవడంతో పాటు, జరిమానా సైతం కట్టలేదు. అధికారులు మాత్రం నోటీసులు ఇచ్చామని చెబుతూ కాలం గడిపారు. మరోవైపు బాధితుడు కిశోర్ సంతకాన్ని ఫోర్జరీ చేసి కథ నడిపిన అధికారులే, సీఎంఆర్ సైతం కిశోరే ఇవ్వాలంటూ ఒత్తిడి చేయడం గమనార్హం.

అధికార దుర్వినియోగం

సీఎంఆర్ విషయంలో ఉన్నతాధికారులే అధికార దుర్వినియోగానికి పాల్పడిన వ్యవహారంలో గత మార్చి 30న బాధితుడి పోరాటంతో ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు ప్రస్తుతం సంగారెడ్డి అదనపు కలెక్టర్‌గా పనిచేస్తున్న, గతంలో నిజామాబాద్ అదనపు కలెక్టర్‌గా పనిచేసిన చంద్రశేఖర్, మాజీ డీఎస్‌వో చంద్రప్రకాశ్, డిప్యూటీ తహసీల్దార్ నిఖిల్‌రాజ్‌లపై వర్ని పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారు. 2022–23 సీజన్‌లో వర్ని మండలంలోని కిశోర్ అనే వ్యక్తికి చెందిన శ్రీనివాస రైస్‌మిల్లుకు కేటాయించిన ధాన్యం పంపించకుండానే పంపించినట్లు చూపించిన ఉన్నతాధికారులే, సదరు రైస్‌మిల్లు యజమాని సంతకాన్ని సైతం ఫోర్జరీ చేయించడం విశేషం. ధాన్యం మాత్రం మాజీ ఎమ్మెల్యే షకీల్ మిల్లుకు పంపించి, కస్టమ్ మిల్లింగ్ రైస్‌ను కిశోర్‌కు చెందిన శ్రీనివాస రైస్ మిల్లు నుంచి ఇవ్వాలని ఈ ఉన్నతాధికారులే ఒత్తిడి తేవడం గమనార్హం. దీంతో దిక్కుతోచని బాధితుడు కిశోర్ నెలల తరబడి న్యాయ పోరాటం చేయాల్సి వచ్చింది.

అధికారంలో ఉన్న సమయంలో..



బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న సమయంలో బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కోట్లాది రూపాయల విలువజేసే ధాన్యాన్ని ప్రభుత్వం నుంచి తీసుకుని ఒక్క గింజ కూడా మిల్లింగ్ చేయకుండా అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఇష్టం వచ్చినట్లు దందా చేశాడు. మళ్లీ అధికారంలోకి వస్తామనే నమ్మకంతో ధాన్యం ఇవ్వకుండానే కిశోర్ మిల్లు నుంచి సీఎంఆర్ ఇవ్వాల్సిందేనని ఒత్తిడి చేయించాడు.

'బెస్ట్ అవైలబుల్'కు దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్: బెస్ట్ అవైలబుల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి నిర్మల ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటో తరగతి, 5వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని ఎస్సీ సంక్షేమ శాఖ కార్యాలయంలో ఈ నెల 31 నుంచి జూన్ 16వ తేదీ దరఖాస్తు ఫారాలు లభిస్తాయని తెలిపారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థిని, విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1,50,000, పట్టణ ప్రాంతాల వారికి రూ.2 లక్షలకు మించరాదన్నారు. ఐదో తరగతిలో దరఖాస్తుకు 4వ తరగతి బోనాఫైడ్, ప్రోగ్రెస్ కార్డు జిరాక్స్ తప్పనిసరిగా జత చేయాలని తెలిపారు. కుల, ఆదాయ, జనన ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, రేషన్ కార్డు జిరాక్స్ ప్రతులపై గెజిటెడ్ అధికారితో సంతకం చేసి అందజేయాలని సూచించారు. జూన్ 20న జిల్లాస్థాయి కమిటీ ఆధ్వర్యంలో లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తామన్నారు.

1న హ్యాండ్‌బాల్ ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక

నిజామాబాద్‌నాగారం: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాల హ్యాండ్‌బాల్ జూనియర్ మెన్, ఉమెన్ విభాగం జట్ల ఎంపికలు జూన్ 1న మాక్లూర్ మండలం కల్లెడలో నిర్వహించనున్నట్లు రాష్ట్ర హ్యాండ్‌బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గంగామోహన్, సురేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపిక ప్రక్రియలో పాల్గొనే క్రీడాకారులు 01.01.2006 నుంచి 31.12.2009 మధ్య జన్మించిన వారై ఉండాలని, జనన ధ్రువీకరణ పత్రాలతో ఆదివారం ఉదయం 8 గంటలకు జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం కోశాధికారి గట్టడి రాజేశ్‌కు రిపోర్ట్ చేయాలని సూచించారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను జూన్ 4 నుంచి 6వరకు నల్గొండ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి టోర్నీకి పంపిస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు 96425 35535, 94404 41757 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

నందిపేట మహిళలకు లక్‌పతి దీదీ అవార్డులు



నందిపేట్(ఆర్మూర్): నందిపేట మండలానికి చెందిన ఇద్దరు మహిళలు లక్‌పతి దీదీ అవార్డులు అందుకున్నారు. పేదరిక నిర్మూలనలో భాగంగా స్వయం సహాయక మహిళా సంఘ సభ్యుల కుటుంబాలను లక్షాధికారులను చేసే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం లక్‌పతి దీదీ పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ పథకం అమలులో రాష్ట్రంలోనే నిజామాబాద్ జిల్లా మొదటిస్థానంలో ఉండగా, లక్‌పతి దీదీలుగా రాష్ట్రం తరఫున నందిపేట మండలం సీహెచ్ కొండూర్ గ్రామానికి చెందిన మంగు లావణ్య, నందిపేటకు చెందిన మహ్మదీ అజ్మీరీ బేగంలు ఎంపికయ్యారు. ఒడిశాలో శుక్రవారం నిర్వహించిన జాతీయ స్థాయి కాన్‌క్లేవ్‌లో ఆ రాష్ట్ర సీఎం మోహన్ చరణ్ మాఝీ చేతుల మీదుగా లావణ్య, అజ్మీరీలు అవార్డు అందుకున్నారు. కాగా, రాష్ట్రంలోనే నందిపేట మండల సమాఖ్య 100 శాతం అజీవిక రిజిస్టర్ నమోదులో ముందుండడంతో ఐకేపీ ఏపీఎం మాణిక్యం సైతం అవార్డు అందుకున్నారు. అవార్డు వచ్చేలా కృషి చేసిన డీఆర్డీవో సాయాగౌడ్, అడిషనల్ డీఆర్డీవో రవీందర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్సెస్సీ సప్లిమెంటరీ పరీక్షలకు బందోబస్తు

ఖలీల్‌వాడి: జిల్లాలో వచ్చే నెల 3 నుంచి 13వ తేదీ వరకు కొనసాగనున్న పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సీపీ పోతరాజు సాయిచైతన్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.50 గంటల వరకు పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తుగా నిషేధిత ఆదేశాలు జారీ చేస్తున్నామన్నారు. కేంద్రాల వద్ద సెక్షన్ 163 అమలులో ఉంటుందన్నారు. ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు గుమిగూడరాదని, సెంటర్ పరిసర ప్రాంతాలలోని అన్ని జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచాలన్నారు.

డిగ్రీ పరీక్షలకు 142 మంది గైర్హాజరు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న డిగ్రీ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షల్లో శుక్రవారం 142 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పరిధిలో ఏర్పాటు చేసిన 32 పరీక్ష కేంద్రాల్లో 1,546 మంది విద్యార్థులకు గానూ 1,404 మంది హాజరైనట్లు తెలిపారు. ఉదయం జరిగిన 6వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షకు 337 మంది విద్యార్థులకు గానూ 319 మంది హాజరైనట్లు తెలిపారు. మధ్యాహ్నం జరిగిన 1వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షకు 1,209 మంది విద్యార్థులకు గానూ 1,085 మంది హాజరైనట్లు వివరించారు.

పరిశోధన కేంద్రం నుంచి మూడు కొత్త వంగడాలు



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ పరిశోధన కేంద్రం అధిపతి అంజయ్య

- వచ్చే నెల 3న విత్తన మేళా
- పరిశోధన కేంద్రం అధిపతి టీ అంజయ్య

రుద్రూర్: రుద్రూర్ ప్రాంతీయ చెరకు, వరి పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు రూపొందించిన కొత్త వంగడాలను సాగుకు విడుదల చేసినట్లు పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ టీ అంజయ్య వెల్లడించారు. వ్యవసాయ పరిశోధన కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుదీర్ఘకాలం తర్వాత రుద్రూర్ చెరకు–81 (2013 ఆర్81/కోఆర్ 19141) రకంతోపాటు వరిలో ఆర్‌డీఆర్–1162, ఆర్‌డీఆర్–1200 రకాలను విడుదల చేశామన్నారు. వీటిని రైతులు సాగు చేసి అధిక దిగుబడులు సాధించాలని కోరారు. నూతన వంగడాలను రూపొందించిన శాస్త్రవేత్తలను ఈ సందర్భంగా ఆయన అభినందించారు.

అభ్యుదయ రైతులకు విత్తనాలు..

వ్యవసాయ పరిశోధన స్థానాల ద్వారా ఉత్పత్తి చేసిన నాణ్యమైన విత్తనాన్ని ప్రతి గ్రామంలో మూడు నుంచి ఐదుగురు అభ్యుదయ రైతులకు అందజేసామని, ఈ కార్యక్రమాన్ని జూన్ 2న సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. గ్రామాల వారీగా విత్తనం తీసుకున్న రైతులు సాగు చేసి పంట ద్వారా ఉత్పత్తి అయిన విత్తనాన్ని స్థానిక రైతులకు తక్కువ ధరకు అందజేయాల్సి ఉంటుందన్నారు. ఎంపిక చేయబడిన రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తలు సలహాలు, సూచనలు అందజేస్తారన్నారు. జూన్ 3న విత్తన మేళా నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో పరిశోధన కేంద్రం, కేవీకే శాస్త్రవేత్తలు రాజ్‌కుమార్, విజయ్‌కుమార్, సాయిచరణ్, రాకేశ్, దినేశ్, రమ్య, సౌందర్య తదితరులు పాల్గొన్నారు.

వెన్నునొప్పితో వెళ్తే ప్రాణాలే పోయాయి

- ఆపరేషన్ తర్వాత మహిళ మృతి
- ప్రైవేటు ఆస్పత్రిలో రోజంతా హైడ్రామా
- వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ కుటుంబీకుల ఆందోళన
- ప్రాణానికి వెలకట్టిన ఆస్పత్రి యాజమాన్యం



ఆస్పత్రిలో గుమిగూడిన మృతురాలి బంధువులు, ఇన్‌సెట్‌లో.. రాధిక (ఫైల్)

నిజామాబాద్‌నాగారం: వెన్నునొప్పి చికిత్స కోసం ప్రైవేటు ఆస్పత్రికి వచ్చిన ఓ మహిళ ఆపరేషన్ అనంతరం కన్నుమూసింది. నగరంలోని ప్రతిభ ఆస్పత్రిలో శుక్రవారం చోటు చేసుకున్న ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. వేల్పూర్ మండలం పడగల్ గ్రామానికి చెందిన రాధిక(35) వెన్నునొప్పితో బాధపడడంతో భర్త సురేశ్ ప్రతిభ ఆస్పత్రికి తీసుకొచ్చాడు. పరీక్షించిన వైద్యులు వెన్నుపూసకు ఆపరేషన్ చేయాల్సి ఉంటుందని తెలపడంతో సురేశ్ ఒప్పుకున్నాడు. గురువారం ఉదయం ఆపరేషన్ పూర్తి చేసి రాధికను వెంటిలేటర్‌పై ఉంచగా శుక్రవారం ఉదయం 8గంటల సమయంలో మరణించింది. కాగా, సీనియర్ వైద్యులు చేయాల్సిన ఆపరేషన్‌ను జూనియర్ వైద్యులు చేయడంతోనే రాధిక మృతి చెందినట్లు భర్త, కుటుంబసభ్యులు ఆందోళనకు దిగారు. ఆపరేషన్ చేస్తామని చెప్పి ప్రాణాలు తీశారంటూ బోరున విలపించారు. ఆస్పత్రి యాజమాన్యం, వైద్యులు వచ్చి మృతదేహాన్ని తీసుకొని బయటికి వెళ్లాలని చెప్పడంతో కుటుంబసభ్యులు ఆగ్రహం వ్యక్తంచేశారు. అదే సమయంలో మృతురాలి కుటుంబీకులు, బంధువులు, కుల సంఘాల ప్రతినిధులు, మీడియా, పోలీసులు ఆస్పత్రికి చేరుకోవడంతో శవాన్ని ఆస్పత్రి లోపలికి తీసుకెళ్లారు. అనంతరం రూ. లక్ష ఇస్తామని, మృతదేహాన్ని తీసుకెళ్లాలని బేరసారాలకు దిగడంతో కుటుంబసభ్యులు మరింత ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆపరేషన్ ఎలా చేశారో, కే షీట్, ఎమ్ఆర్ఐ తదితర వివరాలు బయట పెట్టాలని డిమాండ్ చేశారు. కుటుంబసభ్యుల ఆందోళన, యాదవ సంఘం మహిళా అధ్యక్షురాలు మంజుల యాదవ్ ఒత్తిడితో చివరకు రూ. 3లక్షల 20వేలకు రాజీకుదిరింది. మహిళ మృతి, కుటుంబసభ్యుల ఆందోళన విషయం తెలుసుకొని సిబ్బందితో కలిసి ప్రతిభ ఆస్పత్రికి చేరుకున్న నగర సీఐ శ్రీనివాస్‌రాజ్..బాధితుల నుంచి ఎలాంటి ఫిర్యాదు రాకపోవడంతో వెనుదిరిగి వెళ్లాల్సి వచ్చింది. కాగా, రాధిక మృతదేహానికి పోస్టుమార్టం చేయిస్తే అసలు నిజాలు బయటికి వచ్చేవని స్థానికంగా పలువురు చర్చించుకున్నారు.

నియంత్రించలేకపోతున్నారు!

- ఎత్తిపోతల పథకాలే లక్ష్యంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలు
- లక్షలాది రూపాయల నష్టం
- పది నెలల్లో పది ఘటనలు
- ఆందోళనలో రైతాంగం



తల్వేద లిఫ్ట్ లక్కంపల్లి స్టేజ్–2 వద్ద చోరీకి గురైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

నందిపేట్: జిల్లాలో ఎత్తిపోతల పథకాలే లక్ష్యంగా వరుస చోరీలు జరుగుతున్నాయి. పది నెలల్లో పది ఘటనలు చోటుచేసుకున్నాయి. దుండగులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలోని విలువైన సామగ్రిని ఎత్తుకెళ్తున్నారు. వీటిపై ఆయకట్టు రైతుల సమాచారం మేరకు ఇరిగేషన్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నా ప్రయోజనం లేకుండా పోతోంది. ఇంతవరకు ఎవరు, ఎందుకు చోరీలకు పాల్పడుతున్నారనేది తేల్చలేకపోతున్నారు. జిల్లాలో చోరీల్లో అత్యధికంగా ఉమ్మడి నందిపేట మండలంలోనే జరగడం గమనార్హం. అందులో తల్వేద ఎత్తిపోతల పథకంలో ఇప్పటి వరకు మూడు సార్లు చోరీలు జరిగాయి.

ఒకే తరహాలో ఘటనలు

పది నెలల నుంచి జిల్లాలో వరుస ఘటనలు ఒకే తరహాలో జరుగుతున్నప్పటికీ చోరీలకు పాల్పడుతున్నది ఎవరనేది ప్రశ్నార్థకంగా మిగిలింది. దుండగులు ఎత్తిపోతల పథకాల వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి రూ. లక్షల విలువైన రాగి కాయిల్స్, ఇంధనం, ఇతర పరికరాలను అపహరించుకు పోతున్నారు. ప్రతి చోట ఒకే తరహాలో ఘటనలు చోటు చేసుకుంటున్నాయంటే అనుభవం ఉన్న వ్యక్తులే ముఠాగా ఏర్పడి చోరీలకు పాల్పడుతున్నట్లు రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అయినా ఒక్క కేసు కూడా దర్యాప్తు కొలిక్కి రాలేదు.

వేల ఎకరాలకు ఇబ్బందులు

ఎత్తిపోతల పథకాల ట్రాన్స్‌ఫార్మర్లు పనిచేయకపోవడంతో వేల ఎకరాల్లో ఖరీఫ్ సాగుకు నీరందని పరిస్థితి నెలకొంది.

రూ. లక్షలు వెచ్చించి రిపేర్లు చేసినా మళ్లీ దొంగతనాలు కావడంతో పంటలను ఎలా పండించాలో తెలియక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు దర్యాప్తును వేగవంతం చేసి నిందితులను గుర్తించాలని, ప్రభుత్వం ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

తల్వేద ఎత్తిపోతల పథకంలో చోరీ



మండలంలోని తల్వేద ఎత్తిపోతల పథకం పరిధిలోని లక్కంపల్లి శివారులో ఉన్న రెండవ పంప్ హౌస్ వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను దుండగులు నాలుగు రోజుల క్రితం ధ్వంసం చేసి రాగి కాయిల్స్‌ను దొంగిలించారు. ఎత్తిపోతల కమిటీ సభ్యులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాలుగు నెలల క్రితం ఇదే ట్రాన్స్‌ఫార్మర్‌ను దుండగులు ధ్వంసం చేసి చోరీకి పాల్పడగా రైతులు సుమారు. రూ. 4 లక్షలు వెచ్చించి రిపేరు చేయించారు. మళ్లీ దొంగతనం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ జరిగిన ఎత్తిపోతల పథకాలు

పథకం	నిర్దేశిత ఆయకట్టు (ఎకరాల్లో)
తల్వేద ఎత్తిపోతల పథకం (స్టేజీ-1, స్టేజీ-2లో మూడు సార్లు చోరీ)	3,500
సీహెచ్ కొండూర్ ఎత్తిపోతల పథకం(స్టేజీ-1)	3,784
దత్తాపూర్ ఎత్తిపోతల పథకం	1,000
బాద్గుణ ఎత్తిపోతల పథకం	2,290
మంథని ఎత్తిపోతల పథకం(రెండు సార్లు)	3,500
కందకుర్తి ఎత్తిపోతల పథకం(రెండుసార్లు)	3,500



చోరీకి గురైన కొండూర్ ఎత్తిపోతల పథకం ట్రాన్స్‌ఫార్మర్

రైతులే చూసుకోవాలి

ఎత్తిపోతల పథకాల నిర్వహణ బాధ్యతను ఆయకట్టు రైతులే చూస్తున్నారు. వాటిని వారే భద్రంగా చూసుకోవాలి. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో విలువైన రాగి, ఇతర పరికరాలు చోరీకి గురికావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాం. ట్రాన్స్‌ఫార్మర్లను తిరిగి రైతులే సమకూర్చుకోవాలి. – ప్రవీణ్, ఇరిగేషన్ ఏఈఈ, నందిపేట

దర్యాప్తు చేస్తున్నాం

ఎత్తిపోతల పథకాల్లో వరుస చోరీలు జరగడంపై దర్యాప్తు చేస్తున్నాం. ఎత్తిపోతల పథకాల వద్ద వాచ్‌మన్‌ను నియమించుకోవాలని, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– చిరంజీవి, ఎస్సై, నందిపేట

'పర్యాటకం'పై మళ్లీ ఆశలు

- మూడేళ్లుగా నానుతున్న ఎకో టూరిజం అభివృద్ధి
- పలుమార్లు ఉన్నతాధికారుల పరిశీలన
- అయినా ప్రారంభంకాని పనులు

బాల్కొండ: ఉత్తర తెలంగాణ జిల్లాల వరప్రదాయినిగా పేరుగాంచిన శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లో పర్యాటకం అభివృద్ధిపై మళ్లీ కదలిక వచ్చింది. ఎస్సారెస్పీని పర్యాటకంగా అభివృద్ధి చేయాలంటూ 2017 నుంచి ప్రతిపాదనలు వెళ్లడం..అధికారులు పరిశీలించడం.. ఆ తర్వాత మరిచిపోవడం జరుగుతోంది. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న సమయంలో ఎస్సారెస్పీలో కేవలం ఒక పార్కును మాత్రమే ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు అప్పటి ప్రజాప్రతినిధులు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2017లో ఎస్సారెస్పీలో పునరుజ్జీవ పథకం శంకుస్థాపనకు వచ్చిన అప్పటి సీఎం కేసీఆర్ ఇక్కడి పర్యాటక అందాలను చూసి.. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆ తర్వాత పలుమార్లు సర్వేలు నిర్వహించారు. బాసర నుంచి ఎస్సారెస్పీ వరకు బోటింగ్ ట్రయల్ రన్ కూడా చేశారు. కానీ, అభివృద్ధి వైపు అడుగులు పడలేదు.

ఈసారైనా మొదలవుతాయా?

మూడేళ్ల క్రితం ఎకో టూరిజం తెర పైకి వచ్చింది. అందుకోసం ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్ నిలిచే ప్రాంతాలైన బాల్కొండ మండలం జలాల్‌పూర్, నందిపేట్, డొంకేశ్వర్ మండలాల్లోని గ్రామాలను ఎంపిక చేశారు. ఇక అప్పటి నుంచి కసరత్తు చేస్తూనే ఉన్నారు. ఏడాది క్రితం ఎస్సారెస్పీ ఇరిగేషన్ అధికారుల నుంచి ప్రాజెక్ట్ భూమి టూరిజం శాఖకు బదలాయింపు కూడా పూర్తయ్యింది. తాజాగా గురువారం అడిషనల్ ప్రిన్సిపల్ సెక్రటరీ, చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ సునీత భగవతి ఎకో టూరిజం కోసం కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. పర్యాటకంగా అభివృద్ధి చేస్తే రైతులకు ఏమైనా ఇబ్బందులు ఏర్పడతాయా? అనే కోణంలో పరిశీలించారు. పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని స్పష్టం చేయడంతో ఈసారైనా పనులు మొదలవుతాయా? అనే సందేహం పర్యాటకుల్లో నెలకొంది.



జలాల్‌పూర్ శివారులో ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ నిలిచే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

క్లుప్తంగా

నూతన కార్యవర్గం ఎన్నిక

నిజామాబాద్‌ అర్బన్‌: నగరంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌజ్‌లో శుక్రవారం తెలంగాణ మాదిగ రిజర్వేషన్‌ పోరాట సమితి (టీఎంఆర్పీఎస్‌) నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా మల్లాని శివ, గౌరవాధ్యక్షులుగా గగన్‌ రాజు, జిల్లా ఉపాధ్యక్షుడిగా లింగం, జిల్లా కార్యదర్శిగా ఆర్మూర్‌ గంగారం, డాక్టర్‌ బుర్ర లక్ష్మణ్‌ ఎన్నికయ్యారు. అలాగే నిజామాబాద్‌ పట్టణ అధ్యక్షుడిగా మల్లేశం, మాదిగ మహిళా జిల్లా అధ్యక్షురాలిగా గడ్డం జ్యోతి, మాదిగ ఎంప్లాయిస్‌ ఫెడరేషన్‌ జిల్లా అధ్యక్షులుగా దుర్గయ్య ఆర్మూర్‌ నందిపేట్‌ మండలాల ఇన్‌చార్జీలుగా నడిపి చిన్నయ్య, మాదిగ విద్యార్థి ఫెడరేషన్‌ జిల్లా అధ్యక్షుడిగా అఖిల్‌ ఎన్నికయ్యారు. అనంతరం సీనియర్‌ నాయకులకు దళిత రత్న అవార్డు ప్రదానం చేశారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఇటుక రాజు. టీఎంఆర్పీఎస్‌ రాష్ట్ర అధ్యక్షులు బాలరాజు పీటర్‌ బద్రి రాముడు, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని బడుల్లో చేర్పించవద్దు



సమావేశంలో మాట్లాడుతున్న సీబీఎస్‌ఈ పాఠశాలల అసోసియేషన్‌ ప్రతినిధులు

నిజామాబాద్‌ అర్బన్‌: సీబీఎస్‌ఈ అనుమతి లేని పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించవద్దని సీబీఎస్‌ఈ పాఠశాలల అసోసియేషన్‌ అధ్యక్షుడు సంతోష్‌ కుమార్‌ అన్నారు. మాధవనగర్‌లోని ఎస్‌ఎస్‌ఆర్‌ డిస్కవరీ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఏడు పాఠశాలలకు మాత్రమే సీబీఎస్‌ఈ అనుమతి ఉందన్నారు. మాధవ నగర్‌లోని ఎస్‌ఎస్‌ఆర్‌ డిస్కవరీ పాఠశాల, జన్నేపల్లిలోని ఎస్‌ఎస్‌ఆర్సీ పీఎస్సీ పాఠశాల, దాస్‌నగర్‌లోని నవ్య భారతి గ్లోబల్‌ స్కూల్‌, ఆర్మూర్‌లోని క్షత్రియ సెయింట్‌ ఆన్స్‌, జిల్లా కేంద్రంలోని ప్రెసిడెన్సీ నాలెడ్జ్‌ పార్క్‌ పాఠశాలలకు మాత్రమే సీబీఎస్సీ అనుమతి ఉందన్నారు. కానీ కొన్ని పాఠశాలలు అనుమతి లేకుండా అడ్మిషన్లు చేపడుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు అడ్మిషన్‌ తీసుకునే సమయంలో అడ్మిషన్‌ ఉందా లేదా అని తెలుసుకోవాలన్నారు. అసోసియేషన్‌ గౌరవ అధ్యక్షుడు మారయ్య గౌడ్‌, కన్వీనర్‌ ముజీబుద్దిన్‌, సభ్యులు పవన్‌ కుమార్‌ లక్ష్మీనరసింహస్వామి ఎస్‌ఎస్‌ఆర్‌ డిస్కవరీ పాఠశాల ప్రిన్సిపాల్‌ భాస్కర్‌ పాల్గొన్నారు.

జూన్‌ 4న బాబా ఆలయంలో వేలం

నిజామాబాద్‌ రూరల్‌: మండలంలోని మాధవనగర్‌ సాయిబాబా ఆలయంలో జూన్‌ నాల్గవ తేదీన బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో శ్రీరాం రవీందర్‌ ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఆలయంలో పంచలోహ ఉంగరాలు, తినుబండరాలను అమ్ముకోవడానికి రెండు సంవత్సరాలకు వేలం వేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు జూన్‌ 3లోపు వరకు కొటేషన్‌లు ఆలయ కార్యనిర్వహణ అధికారి కార్యాలయంలో ఇవ్వాలని, 4న ఉదయం 11గంటలకు కొటేషన్‌ లను ఓపెన్‌ చేస్తామన్నారు. అదే రోజు తక్కువ కొటేషన్‌లు వేసిన వారికి వేలంపాట దక్కుతుందని తెలిపారు.

ఆర్టీసీ డ్రైవర్‌ను తిట్టిన వ్యక్తిపై కేసు

ఖలీల్‌వాడి: నగరంలో ఆర్టీసీ బస్సు డ్రైవర్‌ను తిట్టిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు రెండో టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ ఎస్సై సయ్యద్‌ ఇమ్రాన్‌ శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా.. బోధన్‌ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు గురువారం రాత్రి నగరంలోని ఆర్‌ఆర్‌ చౌరస్తా నుంచి పెద్ద పోస్టాఫీస్‌ వరకు వెళ్తుండగా బస్సు వెనుకాల వస్తున్న కొజ్జాకాలనీకి చెందిన షేక్‌రిజ్వాన్‌వుద్దీన్‌ ఓవర్‌ టేక్‌ చేశారు. ఈసమయంలో పక్కన టాటా ఏస్‌ వాహనం నిలిపి ఉండటంతో ఇబ్బంది జరిగిందని, అతడు ఆర్టీసీ డ్రైవర్‌ను అసభ్యకరంగా దూషించాడు. దీంతో ఆర్టీసీ డ్రైవర్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పేరుకే పార్ట్‌టైం.. పనులు ఫుల్‌టైం

- దయనీయంగా మారిన స్కూల్‌ స్వీపర్ల పరిస్థితి
- అరకొర వేతనాలతో తీవ్ర ఇబ్బందులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు



కలెక్టర్‌కు వినతి పత్రం అందించేందుకు వచ్చిన ఉమ్మడి జిల్లా పార్ట్‌టైమ్‌ స్వీపర్లు (ఫైల్‌)

కామారెడ్డి రూరల్‌: ప్రభుత్వ పాఠశాలల్లో పరిశుభ్రతతోపాటు ఉపాధ్యాయులకు, విద్యార్థులకు అన్ని విధాలుగా సౌకర్యాలు కల్పించే పార్ట్‌టైం స్వీపర్ల పరిస్థితి దయనీయంగా మారింది. పేరుకే పార్ట్‌ టైం అయినప్పటికీ పనులు మాత్రం ఫుల్‌టైమ్‌ చేయాల్సి వస్తోందని వారు వాపోతున్నారు. ఉదయం నుంచి పాఠశాల ముగిసే వరకు డ్యూటీ చేయాల్సి వస్తుందని, అయినా అరకొర వేతనాలనే అందిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


ఉమ్మడి జిల్లాలో 110 మంది స్వీపర్లు..

ఉమ్మడి జిల్లాలో సుమారు 200 మంది వరకు పార్ట్‌ టైం స్వీపర్లుగా 1986లో విధుల్లో చేరారు. అప్పటి ప్రభుత్వం కేవలం రూ.150 వేతనం మాత్రమే అందించేది. విధులు నిర్వహిస్తున్న పార్ట్‌ టైమ్‌ స్వీపర్లలో 40 మంది వరకు చనిపోయారు. మరో 30 మంది పదవీవిరమణ పొందారు. ప్రస్తుతం కామారెడ్డి జిల్లాలో 80 మంది వరకు, నిజామాబాద్‌ జిల్లాలో 30 మంది వరకు ఆయా పాఠశాలల్లో స్వీపర్లుగా కొనసాగుతున్నారు. పార్ట్‌టైమ్‌ స్వీపర్లు అన్న మాటే కానీ ప్రతిరోజు పాఠశాలలో ఫుల్‌టైమ్‌ విధులు నిర్వహించాల్సిన వస్తోందని, ఈ ఉద్యోగం వదులుకోలేక ఇతర పనులు చేసుకోలేకపోతున్నామని వాపోతు న్నారు. నెల జీతం రూ.5,200 వస్తుండటంతో 25 రోజులు పనులు చేస్తే రోజు వేతనం రూ. 208 మాత్రమే వర్తిస్తుందన్నారు. దీంతో కనీసం ఉపాధి హామీ కూలీ వేతనం కూడా గిట్టుబాటు కానీ పరిస్థితి ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెండింగ్‌లో వేతనాలు..

పార్ట్‌టైమ్‌ స్వీపర్లుగా ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ వేతనం మాత్రం పెరగడం లేదని, దీంతో కుటుంబాలను ఎలా పోషించుకోవాలో తెలియడం లేదని వారు వాపోతున్నారు. అరకొర వేతనాలు ఇస్తుండటంతోపాటు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ వేతనాలు కూడా నెలల తరబడి బయాయి పెట్టడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి స్వీపర్ల దీన పరిస్థితిని గమనించి వారిని ఫుల్‌టైమ్‌ స్వీపర్లుగా గుర్తించి పూర్తిస్థాయి వేతనాలు అందించాలని కోరుతున్నారు.

కుటుంబాన్ని పోషించలేని దుస్థితి..



నిజామాబాద్‌ జిల్లా వేల్పూర్‌ మండలం వాడి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో గత 40 ఏళ్లుగా పార్ట్‌టైం స్వీపర్‌గా పని చేస్తున్నా. 1986లో జీతం రూ. 150 కాగా ఇప్పుడు రూ.5,200 వస్తుంది. వచ్చే జీతంతో కుటుంబాన్ని పోషించలేని పరిస్థితి ఉంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు పాఠశాలలో అన్ని పనులు చేస్తాం. ప్రభుత్వం మా ఉద్యోగులను పర్మినేంట్‌ చేయాలి. –బాలయ్య, స్వీపర్స్‌ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు

ప్రభుత్వం ఆదుకోవాలి



1992 నుంచి స్వీపర్‌గా పని చేస్తున్నా. ఉదయం గంట కొట్టుడు నుంచి సాయంత్రం బడికి తాళం వేసే వరకు ఉంటాం. మమ్మల్ని మాత్రం పట్టించుకునే వారు లేరు. ఏళ్లుగా వేతనం పెరగడం లేదు. ప్రభుత్వం మా పరిస్థితిని పరిశీలించి ఫుల్‌ టైమ్‌ స్వీపర్‌ గా గుర్తించి పూర్తిస్థాయి వేతనం అందించాలని వేడుకుంటున్నా. ఇప్పటికైనా ప్రభుత్వం స్వీపర్లను ఆదుకోవాలని కోరుతున్నాం. –గడీల సరోజ, గర్ల్స్‌ హైస్కూల్‌, కామారెడ్డి

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి
- హంగర్గపారంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ



హంగర్గా పారంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న పోచారం శ్రీనివాస్‌ రెడ్డి

రుద్రూర్‌: అర్హులైన పేదలందరికి దశల వారీగా రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌ రెడ్డి అన్నారు. పోతంగల్‌ మండలం హంగర్గపారంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల కు శుక్రవారం ఆయన భూమిపూజ చేశారు. కోటగిరి, పోతంగల్‌ మండలాలకు చెందిన 510 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇళ్ల నిర్మాణాల ప్రగతిని జీపీ కార్యదర్శులు పర్యవేక్షిస్తూ, లబ్దిదారులకు అవసరమగు సహకారాన్ని అందించారు. కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు మాట్లాడుతూ... తొలి విడతలో సొంత స్థలం ఉన్నవారికే ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేస్తోందని తెలిపారు. అధికారులు ఇళ్ల నిర్మాణాలను పర్యవేక్షిస్తూ, ప్రతి సోమవారం లబ్దిదారుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తారని అన్నారు. రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్‌ చైర్మన్‌ కాసుల బాలరాజు, బోధన్‌ సబ్‌ కలెక్టర్‌ వికాస్‌ మహతో, తహసీల్దార్‌ గంగాధర్‌, ఎంపీడీవో చందర్‌, ఏఎంసీ చైర్మెన్‌ హన్మంతు, మాజీ జడ్పీటీసీలు శంకర్‌ పటేల్‌, పుప్పాల శంకర్‌, నాయకులు ఎజాజ్‌ ఖాన్‌, బర్ల మధుకర్‌ పాల్గొన్నారు.

వేసవి కార్యాచరణ ప్రణాళిక విజయవంతం

- విద్యుత్‌ అంతరాయాలకు చెక్‌
- ఎన్పీడీసీఎల్‌ ఎస్‌ఈ రాపెల్లి రవీందర్‌



రాపెల్లి రవీందర్‌, ఎస్‌ఈ

సుభాష్‌నగర్‌: నిజామాబాద్‌ సర్కిల్‌లో వేసవి కార్యాచరణ ప్రణాళికను విజయవంతంగా అమలు చేశామని ఎన్పీడీసీఎల్‌ ఎస్‌ఈ రాపెల్లి రవీందర్‌ ఒక ప్రకటనలో తెలిపారు. గతేడాది నవంబర్‌ నుంచి ప్రణాళిక సిద్ధం చేసుకుని, తగిన చర్యలు తీసుకుని మెరుగైన, నాణ్యమైన విద్యుత్‌ను అందించామన్నా రు. లోడ్‌ పెరిగే అవకాశమున్న మామిడిపల్లి, చౌట్‌పల్లి సబ్‌స్టేషన్లలో కొత్తగా 5.0 ఎంవీఏ, 3.15 ఎంవీఏ పవర్‌ ట్రాన్స్‌ఫార్మర్లను నెలకొల్పామని పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని పవర్‌హౌజ్‌ కంపౌండ్‌, తిలక్‌గార్డెన్‌, అర్సాపల్లి, వినాయక్‌నగర్‌లో 8.0 ఎంవీఏ నుంచి 12.05 ఎంవీఏకు పవర్‌ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచామన్నారు. జిల్లాలో 242 కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చే యగా, మరో 202 ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచి ఓవర్‌ లోడ్‌ సమస్య రాకుండా చేశామన్నారు. 33/11 కేవీ సబ్‌స్టేషన్లలోని 11 కేవీ ఫీడర్లలో అంతరాయాలను నివారించడానికి వాక్యూమ్‌ స ర్క్యూట్‌ బ్రేకర్‌ (వీసీబీ)లను ఏర్పాటుచేశామని తెలిపారు. జిల్లాలో 45 వీసీబీలను ఏర్పాటు చేసి చాలా ప్రాంతాల్లో అంతరాయాలు తగ్గించామ న్నారు. 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ నుంచి మ రొక 33/11 కేవీ సబ్‌స్టేషన్‌కు, అలాగే 33/11 కేవీ స బ్‌స్టేషన్‌ నుంచి 132/33 కేవీ సబ్‌స్టేషన్‌కు, అదేవిధంగా 33 కేవీ లైన్‌ నుంచి మరొక 33 కేవీ లైన్‌కు మధ్య అనుసంధానంగా ఏర్పాటు చేసి ప్రత్యామ్నా య విద్యుత్‌ సరఫరా అందజేసేందుకు ఇంటర్‌ లింకింగ్‌ వ్యవస్థ ఎంతగానో దోహదపడుతుందని పే ర్కొన్నారు. 35.337 కిలోమీటర్ల మేర 26 సబ్‌స్టేషన్లలో ఇంటర్‌ లింకింగ్‌ వ్యవస్థ ఏర్పాటు చేశామన్నా రు. అంతరాయాలు లేకుండా మెరుగైన విద్యుత్‌ సరఫరా అందించడానికి ఉద్యోగులు, సిబ్బంది నిబద్ధతతో పని చేయడం వల్లే ప్రణాళిక విజయవంతమైందని రవీందర్‌ తెలిపారు.

బిచ్కుంద కమిషనర్‌కు బాధ్యతల అప్పగింత



దిలీప్‌ కుమార్‌, మున్సిపల్‌ కమిషనర్‌

నిజామాబాద్‌ సిటీ : నిజామాబాద్‌ మున్సిపల్‌ కమిషనర్‌ దిలీప్‌ కుమార్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. కామారెడ్డి జిల్లా బిచ్కుంద మున్సిపాలిటీకి స్పెషల్‌ ఆఫీసర్‌గా నియమించారు. మండల కేంద్రంగా ఉన్న బిచ్కుంద ఇటీవలే మున్సిపాలిటీగా మారింది. దీంతో కొత్త కమిషనర్‌గా షేక్‌ హయ్యూమ్‌ను నియమించారు. శుక్రవారం దిలీప్‌ కుమార్‌ బిచ్కుంద స్పెషల్‌ ఆఫీసర్‌గా చార్జి తీసుకొని, కొత్తగా నియామకమైన షేక్‌ హయ్యూమ్‌కు కమిషనర్‌గా బాధ్యతలు ఇచ్చారు. షేక్‌ హయ్యూమ్‌ ఆర్మూర్‌ మున్సిపాలిటీలో మేనేజర్‌గా విధులు నిర్వహించగా, ఇటీవలే పదోన్నతి లభించింది.

ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభం



డిచ్‌పల్లి: స్టేట్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్‌ఎస్‌ఈటీఐ) డిచ్‌పల్లి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎలక్ట్రీషియన్‌, ఫోటోగ్రఫీ కోర్సుల్లో ఉచిత శిక్షణ తరగతులను శుక్రవారం నాబార్డు డీడీఎం ప్రవీణ్‌ ప్రారంభించారు. ఈ సందర్భంగా అభ్యర్థుల నుద్దేశించి ప్రవీణ్‌ మాట్లాడుతూ.. ప్రస్తుతం మార్కెట్‌లో ఎలక్ట్రీషియన్‌, ఫోటోగ్రఫీ కి మంచి డిమాండ్‌ ఉందన్నారు. ఎంతో మంది యువత ఈ రంగాల్లో స్థిరపడి స్వయం ఉపాధి ద్వారా జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. ఆర్‌ఎస్‌ఈటీఐ ద్వారా ఇచ్చే ఉచిత శిక్షణ ను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా కుటుంబానికి అండగా నిలువాలన్నారు. ఆర్‌ఎస్‌ఈటీఐ డైరెక్టర్‌ రవికుమార్‌, సిబ్బంది ఉన్నారు.

దోమకొండలో కరాటే పోటీలు



దోమకొండ: మండల కేంద్రంలో శుక్రవారం ఒకినోవా గోజరో నీడుకాయ్‌ జాతీయ స్థాయి కరాటే పోటీలను నిర్వహించారు. సంస్థ తెలంగాణ ఆర్గనైజర్‌ కరాటే గ్రాండ్‌ మాస్టర్‌ కామిండ్ల రాజయ్య ఆధ్వర్యంలో 155 మంది క్రీడాకారులకు పోటీలు నిర్వహించారు. పోటీలకు జర్మనీ దేశానికి చెందిన కరాటే గ్రాండ్‌ మాస్టర్‌ హన్షీ ఫీటర్‌, షిహన్‌సోల్‌, బెల్జియం దేశానికి చెందిన షిహన్‌ రెయిన్‌ హోమ్స్‌ హాజరైనట్లు రాజయ్య వివరించారు. మాస్టర్‌లు నవీన్‌కుమార్‌, స్వామి, సాయినాథ్‌గౌడ్‌, సంతోష్‌, లక్ష్మినర్సు, సిద్ధరాములు, కుమార్‌ పాల్గొన్నారు.

అవతరణ వేడుకలకు అతిథిగా రమేశ్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల అతిథిగా టూరిజం డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ పటేల్‌ రమేశ్‌రెడ్డి హాజరు కానున్నారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జూన్‌ 2వ తేదీన కామారెడ్డి జిల్లా కేంద్రంలో అవతరణ వేడుకలను ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. కలెక్టర్‌ ఆశిష్‌ సంగ్వాన్‌ ఆధ్వర్యంలో ఏర్పాట్లు ప్రారంభించారు.

మీకు తెలుసా..



నవనాథపురం నుంచి ఆర్మూర్‌గా..

ఆర్మూర్‌: వందల ఏళ్ల క్రితం దేశం నలుమూలల నుంచి నవనాథులైన గోరఖ్‌నాథ్‌, జలంధర్‌నాథ్‌, చరపట్‌నాథ్‌, అపభంగననాథ్‌, కానీషనాథ్‌, మచ్చీంద్రనాథ్‌, చౌరంగీనాథ్‌ రేవనాథ్‌, బర్తరినాథ్‌ గుట్టపై ఉన్న ఒక ఇరుకైన గుహలో సిద్ధేశ్వరుడిని ప్రతిష్ఠించి పూజలు చేశారని ప్రతీతి. వారి పేరిట సిద్ధుల గుట్టగా పేరు పడింది.

- ఈ నవనాథుల పేరునే గుట్టను ఆనుకొని ఉన్న గ్రామానికి నవనాథపురంగా నామకరణ చేయబడింది.
- కాలక్రమంలో ఈ తొమ్మిది మంది స్వాములలో ఆరుగురు ఇక్కడి నుంచి వెళ్లిపోగా ముగ్గురు ఇక్కడే ఉండి పూజలు చేయడంతో ఆరు.. మూరు.. అంటూ ఆర్మూర్‌గా స్థిరపడింది.
- మరికొందరు ఆర్మూర్‌ అనే పదం ఆరావం అనే పదం నుంచి వచ్చిందని చెపుతుంటారు.
- గుట్టపైన విశ్రాంతికి అనువైన వాతావరణం ఉన్నందున గుట్టను ఆనుకొని ఏర్పడిన గ్రామాన్ని ఆర్మూర్‌ అనే పేరుతో పిలవడం ప్రారంభించినట్లు చెప్పుకుంటారు.
- ఎవరెలా వాదించినా ఆర్మూర్‌ పట్టణానికి సిద్ధుల గుట్ట ఆధ్యాత్మిక కేంద్రంగా ల్యాండ్‌ మార్క్‌గా మారిందని చెప్పుకోవచ్చు.

సమాచారం

- అత్యవసర సేవల కోసం, మహిళలు హింసలకు గురైతే టోల్‌ ఫ్రీ నంబర్‌ – 181
- పోలీసు సహాయం, ఇతర అత్యవసర సేవల కోసం డయల్‌ – 100
- పిల్లలకు సంబంధించి టోల్‌ ఫ్రీ నంబర్‌–1098
- మానసిక సమస్యలతో బాధపడుతుంటే.. టెలీ మానస్‌ హెల్ప్‌లైన్‌ నంబర్‌– 14416

– ఖలీల్‌వాడి

ఉత్తమ హాస్యనటుడు.. కామారెడ్డి కిశోరుడు

- వెన్నెల కిశోర్‌ను వరించిన గద్దర్‌ సినీ పురస్కారం
- ప్రతిభకు దక్కిన గుర్తింపు
- పెరిగింది, చదివింది ఇక్కడే..
- హర్షం వ్యక్తం చేస్తున్న స్నేహితులు, బంధువులు



వెన్నెల కిశోర్‌ను కలిసి అభినందించిన అక్కాబావ పున్న రాజేశ్వర్‌, అరుణ

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : హాస్య నటుడిగా లక్షలాది మంది అభిమానులను సంపాదించుకున్న వెన్నెల కిశోర్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న గద్దర్‌ సినీ పురస్కారం–2024కి ఉత్తమ హాస్య నటుడిగా ఎంపిక చేసింది. వచ్చే నెల 14న హైదరాబాద్‌లో నిర్వహించే వేడుకలో కిశోర్‌కు పురస్కారం అందజేయనున్నారు. కామారెడ్డి పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు లక్ష్మీనారాయణ, యశోద దంపతులకు నలుగురు కూతుళ్లతోపాటు కుమారుడు కిశోర్‌. పట్టణంలోని జీవదాన్‌ హైస్కూల్‌లో పదో తరగతి వరకు చదివిన కిశోర్‌ ఇంటర్మీడియెట్‌ మాతృశ్రీ కాలేజీలో అభ్యసించారు. తరువాత హైదరాబాద్‌లో ఉన్నత చదువులకు వెళ్లారు. డిగ్రీ పూర్తి చేసిన తరువాత విదేశాలకు వెళ్లేందుకు అవసరమైన వివిధ కోర్సులు అభ్యసించారు. ఇంగ్లిష్‌ పత్రికలు, ఇంగ్లిష్‌ నవలలు చదివే అలవాటున్న కిశోర్‌ ఆ భాషపై మంచి పట్టుసాధించారు. మాస్టర్స్‌ కోసం అమెరికా వెళ్లిన కిశోర్‌ చదువు పూర్తికాగానే అక్కడే ఉద్యోగంలో చేరారు. కామారెడ్డికి చెందిన స్నేహితులను కిశోర్‌ రెగ్యులర్‌గా కలుస్తుంటారు.

మరో అవార్డు..

రాష్ట్ర ప్రభుత్వం గద్దర్‌ సినీ పురస్కారాలు–2024ను గురువారం ప్రకటించింది. మత్తువదలరా–2 సినిమాలో నటించిన వెన్నెల కిశోర్‌, సత్యను సంయుక్తంగా ఉత్తమ హాస్యనటులుగా ఎంపిక చేసింది. గతంలో నంది, సైమా అవార్డులను కిశోర్‌ అందుకున్నారు. తాజాగా కిశోర్‌కు మరో అవార్డు దక్కడంతో ఆయన మేనల్లుడు, లిటిల్‌ స్కాలర్స్‌ స్కూల్‌కరస్పాండెంట్‌ పున్న రాజేశ్‌, అక్కా, బావ అరుణ, రాజేశ్వర్‌ ఆనందం వ్యక్తం చేశారు.

సినిమా పేరే ఇంటిపేరుగా..

అమెరికాలో ఉద్యోగం చేస్తున్న సమయంలో (2005) కిశోర్‌కు ఊహించకుండానే సినిమాలో నటించే అవకాశం వచ్చింది. 'వెన్నెల' సినిమాలో ఆయన నటించడంతో ఆ సినిమా పేరే ఆయన ఇంటి పేరుగా మారింది. ఆ తరువాత మూడునాలుగేళ్లపాటు సినీ అవకాశాలు లేకపోవడంతో సాఫ్ట్‌వేర్‌ ఇంజినీర్‌ అయిన తన భార్యతో కలిసి కిశోర్‌ ఇండియాకు వచ్చేశారు. 2009లో సినీ అవకాశాలు రావడం మొదలుకాగా, ఆ తరువాత కిశోర్‌ వెనక్కి తిరిగి చూసుకోలేదు. సుమారు 130కి పైగా సినిమాల్లో ఆయన నటించారు. పూర్తి స్థాయి నటుడిగా సినీ రంగంలో స్థిరపడ్డారు.

సంపూర్ణ అక్షరాస్యతలో భాగస్వాములు కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో అశోక్‌

నిజామాబాద్‌ రూరల్‌: అక్షరకిరణోద్యమ కళాకారులు సంపూర్ణ అక్షరాస్యతలో భాగస్వాములు కావాలని జిల్లా విద్యాధికారి అశోక్‌ పేర్కొన్నారు. నగరంలోని న్యూ అంబేడ్కర్‌ భవన్‌లో శుక్రవారం అక్షరకిరణం 1991 సంవత్సరానికి చెందిన అక్షరకిరణోద్యమ కళాకారుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీఈవో మాట్లాడుతూ అక్షరకిరణోద్యమ కళాకారుల సేవలు అభినందనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ అక్షరాస్యత కార్యక్రమాలు చేపడితే అక్షర కిరణం, అక్షరకిరణోద్యమ కళాకారులకు ప్రాధాన్యమిస్తామని తెలిపారు. జిల్లా సంక్షేమ అధికారి రసూల్‌ బీ, వయోజన విద్య ఉపసంచాలకులు గోవింద రావు, భూపతి వెంకటేశ్వర్లు, తాటి వీరేశం, సు ధాకర్‌ రావు, సిర్ప లింగం, రెడ్డి రాజయ్య, దేవేంద్ర గుప్త, జగదయ్య, రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

ఠాణా నుంచి గంజాయి మాయం

- 2018లో నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న పోలీసులు
- ప్రస్తుతం కనిపించకపోవడంతో విచారణ చేపట్టిన అధికారులు

ఖలీల్‌వాడి: నగరంలోని ఓ పోలీస్‌స్టేషన్‌లో గంజాయి మాయం అయింది. 2018లో గంజాయిని తరలిస్తున్న వారి నుంచి అప్పటి ఎస్‌హెచ్‌వో స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, నిందితులను, గంజాయిని పోలీసులు కోర్టులో చూపించారు. ఎవిడెన్స్‌ కేసు అయిపోయే వరకు పీఎస్‌లో భద్రపర్చాల్సి ఉంటుంది. కానీ భద్రపర్చిన గంజాయి ఇప్పుడు కనిపించకుండా పోవడంతో స్పెషల్‌ బ్రాంచ్‌ అధికారులు విచారణ చేపట్టారు. పోలీస్‌స్టేషన్‌లోని ఓ గదిలోనే కోర్టు కానిస్టేబుల్‌ గంజాయిని భద్రపర్చగా.. అందులో కొంత పోలీసులు అమ్ముకున్నారనే కోణంలో ఎస్బీ పోలీసులు విచారణ చేస్తున్నారు. వారు ఇప్పటికే పీఎస్‌లో సిబ్బందితోపాటు కోర్టు కానిస్టేబుల్‌, 2018 నుంచి పని చేసిన ఎస్‌హెచ్‌వోలను విచారించినట్లు తెలిసింది. ఈ పీఎస్‌ పాతబడిన భవనం కావడంతో గతంలో కూలిపోయింది. అప్పుడు పట్టుకున్న గుట్కా, జర్దా సంచులతోపాటు గంజాయి సంచులు ఏమైనా మార్పులు జరిగాయా లేక గంజాయిని అమ్మివేశారా అనే కోణంలో విచారణ కొనసాగిస్తున్నట్లు సమాచారం. గంజాయి మాయంపై పోలీస్‌ ఉన్నతాధికారులు సీరియస్‌గా ఉన్నట్లు తెలుస్తోంది.

కంబోడియాలోనే కిరణ్‌కుమార్‌ అంత్యక్రియలు



కిరణ్‌కుమార్‌ (ఫైల్‌)

కామారెడ్డి అర్బన్‌: పట్టణ పరిధిలోని దేవునిపల్లికి చెందిన భూంరావుగారి కిరణ్‌కుమార్‌ ఉపాధి కోసం కంబోడియా రాజధాని నాంపెన్‌కి వెళ్లగా, ఈనెల 14న గుండెపోటుతో మృతి చెందాడు. మృతదేహాన్ని సొంతూరికి తీసుకురావడానికి వీసాకు సంబంధించి పలు చిక్కులతో పాటు ఆర్థిక భారం కావడంతో చివరిచూపు కోసం కుటుంబ సభ్యులు పాస్‌పోర్టులకు దరఖాస్తు చేసుకున్నారు. పాస్‌పోర్టులు చేతికి అందడంతో బుధవారం వారు నాంఫెన్‌ వెళ్లారు. శుక్రవారం ఉదయం అక్కడే కిరణ్‌కుమార్‌ అంత్యక్రియలను సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. భార్య మందాకిని, కొడుకు కార్తికేయ, తల్లి సుగుణబాయి, అన్న ప్రవీణ్‌కుమార్‌ అంత్యక్రియల్లో పాల్గొనగా, గుగూల్‌ మీట్‌ ద్వారా ఇక్కడి బంధువులు అంత్యక్రియలను తిలకించి కన్నీరు పెట్టుకున్నారు. నాంఫెన్‌ వెళ్లిన కుటుంబసభ్యులను భారత రాయబార కార్యాలయం అధికారులు మంచి సహకారం అందించారని కిరణ్‌కుమార్‌ బంధువు శ్రీకాంత్‌రావు తెలిపారు.

రోడ్డు ప్రమాదానికి కారణమైన వ్యక్తికి ఐదేళ్ల జైలు

ఇందల్వాయి: రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులకు తీవ్ర గాయాలు కావడంతో కారకుడైన వ్యక్తికి జిల్లా కోర్టు ఐదేళ్ల జైలు శిక్ష విధించింది. వివరాలు ఇలా.. తమిళనాడుకి చెందిన సతీష్‌ గౌడ్‌ అనే లారీ డ్రైవర్‌ రెండు సంవత్సరాల క్రితం మద్యంమత్తులో లారీని వేగంగా నడిపి ఇందల్వాయి టోల్‌ప్లాజా వద్ద ఓ కారుని ఢీకొట్టాడు. కారులో ప్రయాణిస్తున్న కామారెడ్డికి చెందిన బానోత్‌ శారద, ఆనంద్‌, టోల్‌ప్లాజా సిబ్బంది జైల్‌సింగ్‌కి గాయాలయ్యాయి. ఘటనపై టోల్‌ప్లాజా ఆర్పీవో శ్రీనివాస్‌ పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు నిందితుడిని అరెస్టు చేసి, కోర్టులో హాజరు పర్చారు. విచారణ అనంతరం నిందితుడికి జడ్జి శుక్రవారం ఐదేళ్ల జైలు, రూ. 5వేల జరిమానా విధించినట్లు ఎస్సై సందీప్‌ తెలిపారు.

క్రైం కార్నర్‌

డ్రెయినేజీలో పడి ఒకరి మృతి

బిచ్కుంద(జుక్కల్‌): మండల కేంద్రం సమీపంలోని మురికి కాలువలోవో వ్యక్తి ప్రమాదవశాత్తు పడి మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా.. మండలంలోని శక్కర్గ గ్రామానికి చెందిన శంకర్‌(37) బిచ్కుంద మార్కెట్‌లో కూలీ పనులు చేసి, తిరిగి ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి మురికి కాలువలో పడి మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరు..

బాన్సువాడ రూరల్‌: బాన్సువాడ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో సెక్యూరిటీ గార్డుగా పనిచేసే తలారీ శ్రీనివాస్‌ (53) శుక్రవారం స్థానిక ఎల్లయ్య చెరువులో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఎల్లారెడ్డిలో నివాసం ఉండే శ్రీనివాస్‌ విధులకు వెళ్తున్నట్లు చెప్పి ఇంటి నుంచి బయలు దేరాడు. కానీ చెరువులో శవమై ఉండటంపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడి భార్య పద్మావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించినట్లు వివరించారు.

కృష్ణాజివాడిలో ఒకరి ఆత్మహత్య

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని కృష్ణాజివాడి గ్రామంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై మురళి తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన సాకలిసాయిలు(54) గత మూడేళ్లుగా అల్సర్‌, కడుపు నొప్పితో బాధపడుతుండే వాడు. దీంతో జీవితంపై విరక్తి చెందిన సాయిలు శుక్రవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి, గ్రామ శివారులోని వేప చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య మణెవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

బోధన్‌లో గంజాయి పట్టివేత

బోధన్‌ టౌన్‌ (బోధన్‌): పట్టణంలోని ఉద్మీర్‌గల్లికి చెందిన తాహెర్‌ అనే వ్యక్తి వద్ద నుంచి 130 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ వెంకటనారాయణ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు శుక్రవారం తాహెర్‌పై నిఘా పెట్టి అదుపులోకి తీసుకున్నామన్నారు. అతడి వద్ద ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

వేలంపాట అడ్డగింత

ఎడపల్లి(బోధన్‌): మండలంలోని జాన్కంపేట్‌ లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి సంబంధించిన ఆరు ఎకరాల భూమి కౌలు కోసం వేలంపాటను శుక్రవారం నిర్వహించగా ఠాణాకలాన్‌ గ్రామస్తులు అడ్డుకున్నారు. ఆలయానికి చెందిన భూమి ఠాణాకలాన్‌ గ్రామంలో ఉంది. ప్రతియేటా దేవాదాయశాఖ అధికారులు వేలంపాట నిర్వహిస్తారు. కానీ వేలంపాట సక్రమంగా జరగడం లేదని గ్రామస్తులు అధికారులకు స్పష్టం చేశారు. ఈక్రమంలో వేలంపాటను దేవాదాయశాఖ అధికారులు నిలిపివేశారు.

వీడీసీ సభ్యుల బైండోవర్‌

ఎడపల్లి(బోధన్‌): మండలంలోని ఠాణాకలాన్‌ గ్రామం వీడీసీ సభ్యులపై పోలీసులకు ఫిర్యాదు రావడంతో ఎస్సై వంశీచందర్‌రెడ్డి వారిని తహసీల్దార్‌ ఎదుట బైండోవర్‌ చేశారు. వీడీసీలు చట్టంను అతిక్రమించవద్దని లేకుంటే చర్యలు తప్పవని ఎస్సై తెలిపారు.